క్లుప్తంగా

కళ్ల రక్షణకు జాగ్రత్తలు పాటించాలి



నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న కృష్ణారావు

పాలకొండ రూరల్: శరీర భాగాల్లో సున్నితమైన కళ్ల రక్షణకు అవసరమైన జాగ్రత్తలు ప్రతి ఒక్కరూ పాటించాలని పారా మెడికల్ నేత్ర వైద్యాధికారి టి.కృష్ణారావు అన్నారు. స్థానిక బాసూరువారి వీధిలో జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా గురువారం ఇంటింటా కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. అక్కడి సచివాయం వద్ద ప్రత్యేక కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాలైన కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించారు. 14 మందికి కంటి అద్దాలను అందించారు. ఐదుగురిని కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజల వద్దకే నిపుణులైన వైద్యులచే అందిస్తున్న సేవలను సద్వినియోగపర్చుకోవాలని అధికారులు సూచించారు.

ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ నృసింహస్వామి



పూజలందుకుంటున్న నృసింహస్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖీ నది సమీపంలో వెలసిన లక్ష్మీ నృసింహస్వామి గురువారం భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. అర్చకుడు పి. శ్రీనివాసాచార్యులు భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

సాలూరు: మెప్మా ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ర్యాలి చేశారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తూ పనులు, పదవుల్లో రిజర్వేషన్‌లతో పాటు, అనేక సంక్షేమ పథకాలు మహిళలకు అందిస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి తదితరులు అన్నారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం పుష్ప, మహిళా కౌన్సిలర్లు, మెప్మా సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించండి



సచివాలయ సిబ్బందితో వైస్ ఎంపీపీ సురేష్

సాలూరు రూరల్: సచివాలయాలలో ప్రజలకు అందించాల్సిన సేవలు ఏమైన పెండింగ్‌లో ఉంటే వెంటనే పరిష్కరించాలని సచివాలయాల సిబ్బందికి, వలంటీర్లకు వైస్ ఎంపీపీ సురేష్ సూచించారు. గత నాలుగు రోజులుగా మండలంలోని పలు సచివాలయాల సిబ్బందితో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎన్నికలు దగ్గరపడుతున్నాయని ఎన్నికలు కోడ్ ప్రకటించిన నాటి నుండి ప్రభుత్వ కార్యాలయాలలో పనులు నిలిచిపోతాయన్నారు. అందుచేత ఇప్పటివరకు దరఖాస్తు చేసుకొని ఉన్న ప్రజల సమస్యలను తొందరగా పరిష్కరించాలని సూచించారు. అలాగే జగనన్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి..



రికార్డులు పరిశీలిస్తున్న రవికుమార్

సీతానగరం: విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని అడిషినల్ డీఎంహెచ్ఓ పీఎల్ రవికుమార్ అన్నారు. పెదభోగిలి, సీతానగరం, తామరఖండి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలను గురువారం సందర్శించి, విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీని సందర్శించి, రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డాక్టర్ బి. పావని, సీహెచ్ఓ ఎస్‌వీ రమణ, హెల్త్ సూపర్‌వైజర్ శర్మ, ఏఎన్ఎంలు , ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

శివ పూజకు సిద్ధం..

- ముస్తాబైన అడ్డాపుశీల కాశీవిశ్వేశ్వర ఆలయం
- వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు
- శ్రీకాకుళం, విజయనగరం, ఒడిశా నుంచి భక్తుల తాకిడి



అడ్డాపుశీలలో నిర్మించిన ధ్యాన శంకరుని విగ్రహం



పారమ్మతల్లి ఆలయం

పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో అడ్డాపుశీలలో కొలువైన కాశీవిశ్వేశ్వరుడి ఆలయం శివపూజకు సిద్ధమైంది. మహా శివరాత్రిర సందర్భంగా ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. దేవదాయశాఖ ఆధీనంలో ఉన్న ఈ ఆలయంలో కాశీవిశ్వేశ్వరుడు నిత్య పూజలు అందుకుంటున్నాడు. ఈ ఆలయ ప్రాంగణంలో కాశీవిశ్వేశ్వరునితో పాటు మరో 12 ఆలయాలు కూడా ఉన్నాయి. అతి పెద్ద మహానంది విగ్రహాన్ని కూడా ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసింది. కార్తీకమాసంలో, శివరాత్రికి ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. ఆయా రోజుల్లో వేలాది మంది భక్తులు వస్తుంటారు. ముఖ్యంగా శివరాత్రికి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలతో పాటు ఒడిశా రాష్ట్రం నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారు.



ఆలయ ఆవరణలో మహానంది విగ్రహం



ఆలయ ప్రాంగణంలోవున గణపతి దేవుని ఆలయం

భక్తుల తాకిడి..

సుమారు 500 ఏళ్ల కిందట వెలసిన కాశీవిశ్వేశ్వరుని ఆలయానికి పూర్వం నుంచి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలతో పాటు ఒడిశా నుంచి కూడా భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. ఈ ఆలయానికి చేరుకోవాలంటే పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పాలకొండ, కురుపాం, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు ఎక్కి అడ్డాపుశీల బస్టాపు వద్ద దిగి.. అక్కడ నుంచి 600 మీటర్ల దూరంలో ఉన్న ఆలయానికి చేరుకోవచ్చు. పార్వతీపురం నుంచి కూడా ఆటోల్లో చేరుకోవచ్చు. పార్వతీపురం, పార్వతీపురం టౌన్ రైల్వేస్టేషన్‌లో దిగిన భక్తులు కూడా ఆటోల సహాయంతో గాని, బస్సుల ద్వారా గాని చేరుకోవచ్చు.

అతిపెద్ద నంది విగ్రహం

ఈ ఆలయ ప్రాంగణంలో 47 అడుగుల వెడల్పు, 42 అడుగుల ఎత్తు, 24 అడుగుల పొడవు గల అతి పెద్ద నంది విగ్రహాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసింది. ఈ విగ్రహం వల్ల ఆలయానికి కొత్త రూపు వచ్చింది.

శివపూజకు వేళాయె....



మంచాడవలస గుహలో ఉన్న శివలింగం, నంది,వినాయక విగ్రహాలు



పారమ్మ కొండపై వెలసిన పారమ్మతల్లి

సాలూరు: మహా శివరాత్రికి శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. పట్టణంలో పంచముఖేశ్వరస్వామి తదితర శైవాలయాలు, సాలూరు, పాచిపెంట మండలాల్లో శైవాలయాలు, ప్రసిద్ధి క్షేత్రాలు శివరాత్రి పూజలకు సిద్ధమయ్యాయి. సాలూరు మండలంలోని కురుకూటి, మరిపల్లి పంచాయతీ కాకుడువలస, తోణాం గ్రామాల్లో వెలిసిన మూడు స్వయంభు లింగాలు, శివరాంపురం, మామిడిపల్లి తదితర ప్రాంతాల్లో శివాలయాలు, పాచిపెంట మండలంలోని చీపురువలస సమీపంలోని పారమ్మకొండ, మంచాడవలసలోని గోకర్ణేశ్వరస్వామి, పాచిపెంట మండల కేంద్రంలో మల్లిఖార్జునస్వామి, కర్రివలస శివాలయం తదితర శైవ క్షేత్రాల్లో మహాశివుడు అశేష భక్తులతో శివరాత్రి పూజలను అందుకోనున్నారు. పారమ్మకొండ జాతరకు ప్రయాణికుల సౌకర్యార్థం సాలూరు ఆర్టీసీ డిపో నుంచి 25 సర్వీసులు వేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. పాచిపెంట మండలంలోని మంచాడవలస గ్రామ సమీపంలో వెలసిన గోకర్ణేశ్వర స్వామి శివాలయం కొండపై గుహలోకి వెళ్లే ముందు 18 అడుగుల నంది విగ్రహం దర్శనమిస్తుంది. అక్కడే 28 అడుగుల శివుని విగ్రహం ఉంటుంది. సాలూరు మండలంలోని కురుకూటి, మరిపల్లి పంచాయతీ కాకుడువలస, తోణాం గ్రామాల్లో వెలిసిన మూడు స్వయంభు లింగాలు ఉన్నాయి.

ఆలయానికి పూర్వవైభవం



కాశీవిశ్వేశ్వర ఆలయ ప్రాంగణం మళ్లీ పూర్వ వైభవం సంతరించుకుంది. సుమారు 500 ఏళ్ల కిందట వెలసిన ఈ కాశీవిశ్వేశ్వరుని ఆలయాన్ని జైపూర్ మహారాజులు నిర్మించారు. ఈ ఆలయ ప్రాంగణంలో అతి పెద్ద నంది విగ్రహం, మరో 12 ఉప ఆలయాలు ఉన్నాయి. శివరాత్రి పర్వదినాన ఈ ఆలయానికి వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు.
– శ్రీనివాసపాడి, ప్రధాన అర్చకుడు

అర్హులందరికీ ఇళ్లు..



పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: అర్హతే ప్రామాణికంగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని నర్సిపురంలో గృహ లబ్ధిదారులకు ఎమ్మెల్యే పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల స్థలాలు పొందిన వారందరికీ రిజిస్ట్రేషన్ పట్టాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఇటువంటి బృహత్తర కార్యక్రమం దేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగడం లేదన్నారు. ఇంటిపై సంపూర్ణ హక్కులు కల్పించిన ఘతన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. సంక్షేమం కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించాలని కోరారు.

కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్‌పర్సన్ భాగ్యశ్రీ, వైస్ ఎంపీపీలు శిద్దా జగన్నాథరావు, బంకూరు రవికుమార్, పీఏసీఎస్ చైర్మన్ కాపారపు సత్యనారాయణ, స్థానిక సర్పంచ్ బంగారమ్మ, తహసీల్దార్ కె. ఆనందరావు, ఆర్ఐ రామకృష్ణ, గృహసారథులు, కార్యకర్తలు, రెవెన్యూ అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, లబ్ధిదారులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సభ్యులను పక్కదారి పట్టిస్తారా...!

- అధికారులపై మున్సిపల్ సభ్యుల ఆగ్రహం



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

సాలూరు: వినియోగంలో ఉన్న మున్సిపాలిటి కాంప్లెక్స్‌లో 20వ నంబరు దుకాణం, వినియోగంలో లేదని అజెండాలో పెడతారా అంటూ మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ జర్జాపుదీప్తి, కౌన్సిలర్లు గిరి రఘు, రాపాక మాధవరావు, బలబద్రుని శ్రీనివాసరావు, గొర్లె వెంకటరమణ తదితరులు మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో మున్సిపల్ కాంప్లెక్స్‌ను గురువారం పాలకవర్గ సభ్యులు పరిశీలించారు. ఎన్ని దుకాణాలు ఖాళీగా ఉన్నాయి, ఎందుకు ఖాళీగా ఉన్నాయి తదితర విషయాలను అధికారులను ఆరా తీశారు. ఈ క్రమంలో 20వ నంబరు షాపు అనధికారికంగా వినియోగిస్తున్నారని గుర్తించారు. షాపులో మెటీరియల్ ఉందని, గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2017 నుండి నేటి వరకు సుమారు ఆరేళ్లుగా ఎటువంటి అద్దె డబ్బులు చెల్లించలేదని అధికారులు తెలిపారు. వినియోగంలో ఉన్న ఈ దుకాణం ఖాళీగా ఉందని మున్సిపల్ సమావేశ అజెండాలో ఎలా పెట్టారంటూ అధికారులను కౌన్సిలర్లు నిలదీశారు. కాగా తాము ఇటీవలే వచ్చామని ఈ విషయం మా దృష్టిలో లేదని మున్సిపల్ అధికారులు కౌన్సిల్ సభ్యులుకు తెలిపారు. గడిచిన ఆరేళ్ల నుండి డబ్బులు వసూలు చేయించాలని ఆదేశించారు. దుకాణానికి అధికార్లు మరోతాళాన్ని వేశారు.

మహిళా సాధికారతకు ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి
- ఘనంగా మహిళా దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి

పార్వతీపురం టౌన్: మహిళా సాధికారతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అన్నారు. పట్టణంలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఛైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, మహిళలు, తదితరులు పాల్గొన్నారు. అలాగే పింఛనర్ల భవనంలో ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానంగా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో దిశా ఎస్సై లావణ్య, న్యాయవాది ప్రమీల, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

కళ్లద్దాల పంపిణీ

పార్వతీపురం టౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీలో గతంలో నేత్ర పరీక్షలు చేయించుకున్న అవ్వాతాతలకు గురువారం కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ బి. జగన్నాథరావు మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా నేత్ర వైద్య సిబ్బంది ద్వారా కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 1922 మందికి కళ్లజోళ్లను ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆప్తాలమిస్ట్ నగేష్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం చేసిన సీఎం జగన్



ఇంటి స్థల పత్రాలు పొందిన లబిద్ధారులతో రంగునాయుడు

మక్కువ: పేదల సొంతింటి కలను సాకారం చేసిన మహోన్నత వ్యక్తి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు అన్నారు. స్థానిక సచివాలయంలో మక్కువకు చెందిన 76 మంది లబ్ధిదారులకు తొలి విడతగా జగనన్న ఇంటి స్థల పత్రాలను తహసీల్దార్ ఎ.సింహాచలం ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన రంగునాయుడు మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం సీఎం ప్రతి క్షణం పరితపిస్తున్నారన్నారు. జగనన్న కాలనీల్లో నిర్మించుకున్న గృహాలు ఊళ్లు వలె రూపుదిద్దుకున్నాయన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సింహాచలం, వీఆర్ఓ కాశీరాజు తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ యూత్ వలంటీర్ల ఎంపిక పూర్తి



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న దృశ్యం

పార్వతీపురం టౌన్: నేషనల్ యూత్ వలంటీర్ల ఎంపిక పూర్తయ్యిందని జిల్లా యువజన అధికారి కె. వెంకట ఉజ్వల్ తెలిపారు. గురువారం స్థానిక యువజన సంక్షేమ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతేదాది మర్చిలో నేషనల్ యూత్ వలంటీర్లకు దరఖాస్తులు ఆహ్వానించగా.. 360 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీరిలో ముగ్గురిని ఎంపిక చేసి, ఆరుగురిని వెయిటింగ్ లిస్ట్‌లో పెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు. సాయికుమార్, కె. తిరుపతిరావు, కె. పద్మనాభం పాల్గొన్నారు.

వాహనాల వేలం



వాహనాల వేలం నిర్వహిస్తున్న అధికారులు

సాలూరు: సారా, ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం వేలం వేశారు. మూడు బైక్‌లు, ఐదు నాలుగు చక్రాల వాహనాలకు నిర్వహించిన ఈ వేలంలో రెండు బైక్‌లు, మూడు నాలుగు చక్రాల వాహనాలను వేలం పాడినట్టు పట్టణ ఎస్ఐ సీతారాం తెలిపారు. ఏఎస్పీ సునీల్‌సరన్, సీఐ వాసునాయుడు ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు.

బీజేపీని గద్దె దించాలి

కురుపాం: దేశం సమైక్యంగా ఉండాలంటే బీజేపీని గద్దె దించాల్సిందేనని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.తులసిదాసు అన్నారు. కురుపాంలో ఆ పార్టీ ఎన్నికల విస్తృత స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కురుపాం నియోజకవర్గంలో సీపీఎం తరఫున అభ్యర్థి బరిలో ఉంటారన్నారు. బీజేపీతో జత కట్టిన పార్టీలకు ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన సీపీఎం నాయకులు సుబ్బరామమ్మ, కృష్ణమూర్తి, వేణు, మన్మధరావు, అవినాష్, రమణ, గంగునాయుడు, తిరుపతిరావు, సాంబమూర్తి పాల్గొన్నారు.